క్లుప్తంగా

సూర్యగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు



సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి మహిళలు బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. అనంతరం ఆలయంలో సామూహిక శ్రీ సత్యానారాయణ స్వామి వ్రతాలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజారులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



కందుకూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ తదితరులు

కందుకూరు: హైదరాబాద్ నాగోల్‌లో ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోకు సంబంధించిన వాల్ పోస్టర్లను మండల ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ సూరజ్‌కుమార్ ఆవిష్కరించారు. సదస్సుకు పెద్ద ఎత్తున ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు హాజరుకావాలని ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పురుషోత్తం, ప్రధానకార్యదర్శి హరి ప్రసాద్, ఉపాధ్యక్షుడు చందుగౌడ్, సభ్యులు మాధవరెడ్డి, రాకేష్‌రెడ్డి, జంగయ్య, బాలకృష్ణ, మహేందర్, మల్లేష్, లింగం, బాలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ ఆవిర్భావ వేడుక



ఆర్‌సీఐలో నినాదాలు చేస్తున్న సంఘం నేతలు

తుక్కుగూడ: భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) 70వ ఆవిర్భావ వేడుకను మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ఆర్‌సీఐలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు.. గత 69 ఏళ్లుగా దేశ కార్మికుల సంక్షేమం కోసం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కార్మికులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్, సయ్యద్ సాబేర్ హుస్సేన్, మహేందర్, గోవర్ధన్‌రెడ్డి, రాజ్‌కుమార్, రాజేష్, శంకర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు వీడ్కోలు



బదిలీ అయిన మేనేజర్, ఆర్ఓలను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

మీర్‌పేట: సాధారణ బదిలీల్లో భాగంగా మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో గత నాలుగేళ్లుగా మేనేజర్‌గా పనిచేసిన వెంకట్‌రెడ్డి, రెవెన్యూ అధికారి అంజన్‌రెడ్డి స్థానచలనం చెందారు. ఈ సందర్భంగా మంగళవారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇద్దరు అధికారులను సిబ్బంది, కమిషనర్, ఇతర అధికారులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ బి.చంద్రశేఖర్, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల సందడి



బోనాలు తీసుకెళ్తున్న విద్యార్థులు

పహాడీషరీఫ్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే బోనాల ఉత్సవాలను పాఠశాలల్లో కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఆషాఢ మాసం బోనాలను పురస్కరించుకొని జల్‌పల్లి మున్సిపాలిటీలో శ్రీరాం కాలనీలోని భవిష్య హైస్కూల్‌లో జోగిని పావని, గజానంద్ డబ్బేకర్ పోతరాజు, కరస్పాండెంట్ రాఘవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శిల్పల సమక్షంలో విద్యార్థులు బోనాలు తలపై పెట్టుకొని ఆడి పాడారు.

అధ్వాన రహదారి.. అవస్థలే మరి

- గుంతలతో ఛిద్రమైన గ్రామీణ రోడ్డు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పాడైన రహదారి

కందుకూరు: గుంతలమయమైన రహదారితో గ్రామస్తులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డుని ఎవరూ పట్టించుకోకపోవడంతో అక్కడి నుంచి రాకపోకలు సాగించాలంటే వారికి తిప్పలు తప్పడంలేదు. గుంతలు, గతుకుల రోడ్డుపైనే ప్రయాణం సాగిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇదీ మండల పరిధిలోని మురళీనగర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి.

రెండు కిలోమీటర్లు నరకం

మండలంలోని మురళీనగర్ గ్రామంలో దాదాపుగా 1,300 జనాభా, 1100 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 300 వరకు ఇళ్లు ఉన్నాయి. ఆ గ్రామంలో అత్యధికంగా 80 శాతానికి పైగా గిరిజనులు, మిగతా జనాభాలో కూడా అధికులు ఎస్సీలే ఉన్నారు. కాగా వారంతా అవసరమైతే మండల కేంద్రానికి గాని హైదరాబాద్ వైపు గాని వెళ్లాలంటే చిప్పలపల్లి గ్రామం మీదుగా ఉన్న రహదారి నుంచే రాకపోకలు సాగించాలి. ఆ రెండు గ్రామాల మధ్య ఉన్న రెండు కిలోమీటర్ల మేర ఉన్న రహదారి ప్రస్తుతం పూర్తిగా గుంతలతో అధ్వానంగా మారింది. 15 ఏళ్ల క్రితం అప్పటి ఉమ్మడి ప్రభుత్వంలో రహదారిని నిర్మించారు. మధ్యలో ఒక్కసారి మాత్రం మరమ్మతులు చేయించారు. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం గుంతలతో ఆ రహదారిపై ప్రయాణించాలంటే నానా అగచాట్లు పడాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



ఛిద్రమైన మురళీనగర్- చిప్పలపల్లి గ్రామాల రోడ్డు

ఇబ్బందిగా ఉంది



చిప్పలపల్లి నుంచి మురళీనగర్ వరకు రెండు కిలోమీటర్ల మేర ఉన్న రహదారి పూర్తిగా గుంతలమయమైంది. ఆ రహదారిపై ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలవడంతో ప్రమాదాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– మాణిక్యం, గ్రామస్తుడు, మురళీనగర్

నిధులు మంజూరయ్యాయి



చిప్పలపల్లి–మురళీనగర్ గ్రామాల మధ్య రెండు కిలోమీటర్ల మేర ఉన్న బీటీ రహదారి గుంతలమయంగా ఉంది. ఆ రహదారిని నిర్మించడానికి ప్రతిపాదనలు పంపించాం. రూ.3.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం టెండర్ ప్రక్రియలో ఉంది. టెండర్ పూర్తయితే పనులు ప్రారంభిస్తాం.

– సతీష్‌రెడ్డి, ఏఈ పీఆర్, కందుకూరు

కేంద్ర పద్దుపై మిశ్రమ స్పందన

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ప్రజా స్పందన మిశ్రమంగా వ్యక్తమైంది. ఆయా వర్గాలకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సామాజిక వేత్తలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కొందరు అద్భుతంగా, అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉందని కితాబిచ్చారు. మరికొందరు పేదలను విస్మరించిన బడ్జెట్ అని విమర్శించారు. కేంద్ర పద్దుపై మహేశ్వరం నియోజకవర్గంలో నేతల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

ఉపాధ్యాయులకు నిరాశే

తుక్కుగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశ పరిచిందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటప్ప పేర్కొన్నారు. సీపీఎస్ విధానంలో మార్పు చేస్తామని చెబుతూనే పాత పెన్షన్‌పై మాట కూడా బడ్జెట్‌లో లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించందన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ప్రస్తుత బడ్జెట్‌లో 3.25 శాతం నిధులను మాత్రమే కేటాయించిందన్నారు.

– టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు

యువతలో నైపుణ్యం పెంచేలా



తుక్కుగూడ: యువతలో నైపుణ్యం పెంచేలా కేంద్ర బడ్జెట్ ఉందని బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం అన్నారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ అందరిని కలుపుకొని విధంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని వర్గాల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్‌ను రుపొందించిందన్నారు. యువత కోసం 5 పథకాలతో పీఎం ప్యాకేజీ కింద రూ.రెండు లక్షల కోట్లు కేటాయించిందన్నారు.

– బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ శ్రీశైలం

దేశ సంక్షేమానికి పెద్ద పీట



కందుకూరు: కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం 7వ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశ సంక్షేమానికి పెద్ద పీట వేశారు. నిరుపేదలు, రైతులు, మహిళలు, యువతను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం శుభపరిణామం. గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2.66 లక్షల కోట్లు కేటాయింపులు చేశారు. చిరు వ్యాపారుల అభివృద్ధి కోసం ముద్ర యోజన పథకం ద్వారా రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణ సదుపాయానికి అవకాశం కల్పించారు. మొత్తానికి బడ్జెట్ చాలా బాగుంది.

– సాధ మల్లారెడ్డి, బీజేపీ జిల్లా పంచాయతీరాజ్ సెల్ కన్వీనర్

తెలంగాణకు మొండి చేయి



కందుకూరు: కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపిస్తూనే ఉంది. తెలంగాణ నుంచి అధికంగా పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్తున్నా బడ్జెట్ కేటాయింపులు మాత్రం నామ మాత్రంగానే వస్తున్నాయి. ఐటీఆర్, బయ్యారం ఉక్కు గనులు తదితరాల గురించి కేటాయింపులే లేవు. విభజన హామీలను విస్మరించారు. బీజేపీ ఎంపీలు, మంత్రులు రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా నోరు మెదపకపోవడం సిగ్గు చేటు.

– ఏనుగు జంగారెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్

విద్యారంగానికి ప్రాధాన్యం లేదు



హుడాకాంప్లెక్స్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 2.5 శాతం నిధులు రూ.1,25,638 కోట్లు మాత్రమే కేటాయించడం దురదృష్టకరం. విద్యాభివృద్ధి లేనిదే వికసిత్ భారత్ ఎలా సాధ్యమవుతుంది. అదే విధంగా ఉద్యోగులకు కూడా బడ్జెట్ నిరాశనే మిగిల్చింది. సంవత్సరానికి రూ.12 లక్షలు సంపాదించే వారు 15 శాతం పన్నులు కట్టాలి. పేద, మధ్య తరగతి వారికి ఆమోదయోగ్యమైన బడ్జెట్ అయితే కాదు.

– వై.కరుణాకర్‌రెడ్డి, ఎస్‌టీయూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఉద్యోగులను నిరాశ పర్చిన బడ్జెట్



మీర్‌పేట: సీపీఎస్ విధానంలో మార్పు చేస్తామని చెప్పి పాత పెన్షన్ విధానంపై పల్లెత్తు మాట కూడా బడ్జెట్‌లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర నిరాశ కలిగించింది. ఈసారైనా పాత విధానంలో పన్నులు చెల్లించే వారికి రాయితీ లభిస్తుందని అంతా ఊహించినప్పటికీ నిరాశే మిగిలింది. విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, ప్రస్తుత బడ్జెట్‌లో 3.25 శాతం మాత్రమే కేటాయించడం దురదృష్టకరం.

– డి.ఆంజనేయులు, టీఎస్‌యూటీఎఫ్ బాలాపూర్ మండల ప్రధాన కార్యదర్శి

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

ఎంపీడీవో సుజాత



మాట్లాడుతున్న ఎంపీడీవో సుజాత

కడ్తాల్: గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు, పారిశుద్ధ్యం విషయంలో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సుజాత పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి ఎంపీడీవో సుజాత ఆధ్వర్యంలో ఓడీఎఫ్, హర్‌ఘర్ జల్ ప్రచారానికి సంబంధించి ప్రత్యేక గ్రామసభ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దని సూచించారు. బహిరంగ మలమూత్ర విసర్జన నివారణకు కృషి చేయాలని, ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. హర్‌ఘర్ జల్ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఇమ్రాన్ బాబా, భిక్షపతి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్‌రెడ్డి రాంరెడ్డికి సన్మానం

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర రోడ్డు డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని కాంగ్రెస్ నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. చంచల్‌గూడ జైల్ మాజీ సలహాదారుడు కేవీ రమేష్‌రాజు, కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎన్ను గోవర్ధన్‌రెడ్డిలు రాంరెడ్డికి శాలువ కప్పి, తలపాగా పెట్టి, బొకె ఇచ్చి గజమాలతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, శివలింగం తదితరులు పాల్గొన్నారు.



మల్‌రెడ్డి రాంరెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఆమనగల్లులో బీఎంఎస్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు ఎదుట మంగళవారం భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి లక్యానాయక్, ఉపాధ్యక్షుడు యాదయ్య, శంకర్, సభ్యులు చందర్, పంతు, మల్లిక్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్టారావ్, అప్పారావ్, అలివేలు, విజయ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించండి

రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్

కడ్తాల్: గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబునాయక్ పేర్కొన్నారు. ఆగస్టు 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని జిల్లా స్థాయి సన్నాహక సమావేశాన్ని మంగళవారం మండల కేంద్రంలోని ఎంబీఏ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబునాయక్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. లంబాడాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ పెంపునకు సంబంధించిన జీవో నెంబర్ 33కు వెంటనే చట్టబద్ధత కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలన్నారు. గిరిజనులకు ఎస్టీ కమిషన్‌తో పాటు, ట్రైబల్ అడ్వైజర్ కమిటీని వెంటనే నియమించాలన్నారు. నూతనంగా ఏర్పడిన గిరిజన గ్రామ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని, తండాల అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల సేవాలాల్ సేన కమిటీలను ఎన్నుకున్నారు. కడ్తాల్ మండల సేవాలాల్ సేన అధ్యక్షుడిగా ఇస్లావత్ రమేశ్‌నాయక్, తలకొండపల్లి అధ్యక్షుడిగా సభావత్ రూప్లానాయక్, మాడ్గుల మండల అధ్యక్షుడిగా నేనావత్ రవినాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రఘురాం రాథోడ్, వాంకుడోత్ నరేశ్‌నాయక్, లక్పతినాయక్, భీంలాల్‌నాయక్, రాజునాయక్, కృష్ణనాయక్, బలరాంనాయక్, జగన్, శ్రీను, హీరాసింగ్, రమేశ్, లక్ష్మణ్‌నాయక్ మోతీలాల్, రాజు, కొర్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంబాబునాయక్

ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఎంపిక

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్‌ను మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిహెచ్. వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా బాబు, కోశాధికారిగా నవీన్, కార్యదర్శిగా ఎన్. శివ కుమార్, మీడియా ఇన్‌చార్జి పి. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా శేఖర్, బాల్‌రాజ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఇన్‌చార్జిగా నరేందర్‌లు ఎంపికయ్యారు.

వాల్‌పోస్టర్ విడుదల

ఇబ్రహీంపట్నం: ఫొటో, వీడియో గ్రాఫర్లు మారుతున్న సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా నూతన మెలుకువలు నేర్చుకోవాలని ఏసీపీ కేపీవీ రాజు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పో కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఇబ్రహీంపట్నంలో మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు దాసు, కార్యదర్శి సంజీవ, కోశాధికారి యాదగిరితోపాటు నగేష్, రాములు, రాజు, మహేందర్, బాబురావు, రవి, సాయి, సూర్య, శ్రావణ్, దినేష్, శ్రీకాంత్, అరవింద్, రమేష్, పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చేర్పించండి

ఆమనగల్లు: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఆమనగల్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందిస్తారని ఆమె చెప్పారు. పట్టణంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మబాట అంగన్‌వాడీ బాట' నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు.

ఈతచెట్లను నాటాలని వినతి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని కాటమేశ్వర దేవాలయం వద్ద ఈత, ఖర్జూర చెట్లను నాటాలని మండల గౌడ యువజన సంఘం అధ్యక్షుడు నరేశ్‌గౌడ్ కోరారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఎస్ఐ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేశ్‌గౌడ్ మాట్లాడుతూ కాటమేశ్వర దేవాలయం స్థలంలో ఈత, ఖర్జూర చెట్లు నాటాలని ఆయన వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ యువజన సంఘం నాయకులు గజ్జె రాఘవేందర్‌గౌడ్, కుమార్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గౌరవం

కడ్తాల్: ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపుతో పాటు సమాజంలో గౌరవించబడుతారని, ఎంపీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి బొప్పిడి గోపాల్ అన్నారు. మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో పదిహేను సంవత్సరాలుగా పశుగణాభివృద్ధి శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న అప్సర్, గట్టు ఇప్పలపల్లి గ్రామానికి బదిలీ అయ్యారు. మంగళవారం రావిచేడ్ గ్రామంలోని పశువైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అప్సర్‌ను గ్రామస్తులు సన్మానించి, వీడ్కోలు పలికారు.

సాగులో మెలకువలు పాటించండి



ఆమనగల్లు: రాంనుంతలలో రైతులకు సలహాలు ఇస్తున్న వ్యవసాయాధికారి అరుణకుమారి

వ్యవసాయాధికారి అరుణకుమారి

ఆమనగల్లు: రైతులు పంట సాగులో మెలకువలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. రాంనుంతల గ్రామంలో రైతులు సాగుచేసిన పంటలు వరి, పత్తి, జొన్న, మొక్కజొన్న పైర్లను మంగళవారం ఆమె పరిశీలించి సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ పంటల సాగులో మెలకువలు పాటించడం ద్వారా చీడపీడలను అరికట్టవచ్చన్నారు. వరి నారు నాటే ముందు కొనలు తుంచి నాటడం వల్ల కాండం తొలచు పురుగు గుడ్లను నివారించొచ్చని ఆమె చెప్పారు. కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరాకు 2కిలోల చొప్పున వాడటం వల్ల వరినాటిన తరువాత 45 రోజుల వరకు కాండం తొలచు పురుగు అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు శంకర్, సక్రు, శంకర్, జోలీ, పిప్లి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండలంలోని రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతో పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న శాఖీయ దశలో ఎక్కువ నీటిని తట్టుకోదని, కాబట్టి పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. మొక్కజొన్నను ఈ నెల 31వరకు విత్తుకోవచ్చని తెలిపారు. ముందు జాగ్రత్తగా జొన్నలో వచ్చు కాండం తొలుచు పురుగు నివారణకు, విత్తిన 30, 35రోజుల్లోపు ఎకరాకు 4 కిలోల కార్బొఫ్యూరాన్, 3జి గుళికను కాండము సుడులలో వేసినచో కాండం తొలుచు పురుగును పూర్తిగా అరికట్టవచ్చని తెలిపారు. ప్రస్తుత సమయంలో కంది పంటకు పైటాపార ఎండు తెగులు వచ్చే అవకాశముందని, 2 గ్రాముల మెటలాక్సిల్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసినట్లయితే తెగులు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు.

విద్యతోనే గుర్తింపు

రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్

కడ్తాల్: విద్యతోనే గుర్తింపు ఉంటుందని మాజీ జెడ్పీటీసీ రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెలుగురాళ్ల తండాకు చెందిన ఇస్లావత్ మారుతికుమార్ జేఈఈ ఐఐటీ అడ్వాన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా ఎస్టీ కేటగిరిలో 391వ ర్యాంకుతో ప్రతిభ చాటాడు. మంగళవారం మండల కేంద్రంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మారుతికుమార్‌ను, ట్రస్ట్ చైర్మన్ దశరత్‌నాయక్‌తో పాటు, స్థానిక గిరిజన నాయకులు అభినందించి సన్మానించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.5వేలు అందజేశారు. అనంతరం దశరథ్‌నాయక్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాండు, కృష్ణ, శ్రీను, చందర్, వెంకటేశ్, రతన్, గణేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లిలో టీకూరి పోచమ్మ మంగళవారం మృతి చెందింది. పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసురెడ్డిలు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కేశవరెడ్డి రూ. 2,500, కాసు శ్రీనివాసురెడ్డి రూ. 5,000 ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ ఇంజనీర్ బండ్ల తిరుపతి రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జంగయ్య, కృష్ణయ్య, రాజు, చెన్నకేశవులు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.